# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం-04-ఏప్రిల్-2026 | సంపుటి : 3 | సంచిక : 306 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## వరంగల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**అక్రమ కార్యకలాపాలు వెలుగులోకి**

**అనధికార ఏజెంట్లు, భారీ నగదు స్వాధీనం**

**కోట్ల లావాదేవీలపై దర్యాప్తు**

**వరంగల్, ఏప్రిల్ 3 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

వరంగల్ జిల్లా హనుమకొండలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.

మిగతా 2లో..

## ఏఐ సునామీ ముప్పు... ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి అవసరం

**సిఎం రేవంత్ రెడ్డి**



**ఇబ్రహింపట్నం,ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ వల్ల భవిష్యత్తులో ఏర్పడే ప్రభావాలపై ముందస్తుగా ఆలోచించి ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వైట్ కాలర్ ఉద్యోగాలు తగ్గే అవకాశముంటే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని, అందుకు అనుగుణంగా బ్లూ కాలర్ ఉద్యోగాలకు ప్రాధాన్యం పెంచే దిశగా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సూచించారు.

మిగతా 2లో..

## ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణకు హ్యాట్రిక్ విజయం

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకుని హ్యాట్రిక్ సాధించిన తెలంగాణ పోలీసులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ విజయం రాష్ట్ర పోలీసుల నిరంతర కృషి, క్రమశిక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ సీఐడీ పర్యవేక్షణలో కొనసాగుతున్న శిక్షణ వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. జాతీయ స్థాయిలో మరోసారి ప్రతిభ చాటిన నేపథ్యంలో డీజీపీ బి. శివధర్ రెడ్డి, సీఐడీ అదనపు డీజీ చారు సిన్హాను ముఖ్యమంత్రి అభినందించారు. తెలంగాణ పోలీసుల విజయ పరంపర గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతోందని పేర్కొన్నారు. 2024లో లక్నోలో, 2025లో రాంచీలో జరిగిన పోటీలలో విజయం సాధించిన తెలంగాణ, తాజాగా 2026లో నాగ్‌పూర్‌లో జరిగిన 69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో కూడా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. నాగ్‌పూర్‌లో జరిగిన ఈ పోటీలలో తెలంగాణ ప్రతినిధి బృందం అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీతో పాటు యాంటీ సాబోటేజ్ చెక్, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవగాహన విభాగాల్లో విజేతగా నిలిచింది. శాస్త్రీయ దర్యాప్తు సహాయాలు, పోలీస్ ఫోటోగ్రఫీ విభాగాల్లో రన్నరప్ స్థానం సాధించింది.

# 2047 నాటికి దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ

**ఏటెక్స్‌కాన్-2026లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**

**వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు**

**గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లు, మహిళా సాధికారతకు పెద్దపీట**



**హైదరాబాద్, ఏప్రిల్ 03 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

నగరంలోని హైటెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం మరియు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహించిన 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సును ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 'అటెక్స్‌కాన్2026' ప్రత్యేక నివేదికను విడుదల చేసి, అక్కడ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియాలోనే అత్యుత్తమ టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. వస్త్ర పరిశ్రమ తెలంగాణ ప్రజల డీఎన్‌ఏలోనే ఉందని, శతాబ్దాలుగా కళలు, సంస్కృతి ఇక్కడ వస్త్ర రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయని ఆయన కొనియాడారు. తెలంగాణలో పత్తి ఉత్పత్తి మరియు నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, ఇది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాకుండా లక్షలాది మందికి జీవనాధారమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ నుండి గద్వాల చీరల వరకు, వరంగల్ దుర్రీస్ నుండి నారాయణపేట చేనేత వరకు ప్రతిదీ రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని చెప్పారు.

మిగతా 2లో..



## సీఎం పర్యటనకు భారీ స్థాయిలో ఏర్పాట్లు

**పిప్రి గ్రామంలో సభా ప్రాంగణం పరిశీలన**

**మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం**

**ప్రజలకు సౌకర్యాలు, భద్రతపై ప్రత్యేక దృష్టి**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ఈ నెల 6న జరుగనున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపడుతోంది.

మిగతా 2లో..



## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై కవిత గర్జన

**అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్**

**40 శాతం ఫీజుల పెంపుతో తల్లిదండ్రులపై పెనుభారం**

**ఫీజు నియంత్రణ చట్టం తేవడంలో ప్రభుత్వం విఫలం**

**కార్పొరేట్ విద్యాసంస్థల్లో తనిఖీలు చేపట్టాలని 'జాగృతి' విజ్ఞప్తి**

2లో

## రేవంత్ ప్రభుత్వంపై జీవన్ రెడ్డి తిరుగుబాటు

- రెండు వారాల్లో రాజకీయ భవిష్యత్తుపై ప్రకటన
- కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి.. మార్పు కోరుకుంటున్న ప్రజలు
- మేడిగడ్డ పునరుద్ధరణపై నిర్లక్ష్యం వహిస్తే 18 లక్షల ఎకరాలు ఎడారిగా మారుతాయని హెచ్చరిక
- నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం తన ఎదుగుదలను అడ్డుకోవడమేనని ఆరోపణ

2లో



## హైదరాబాద్ కొండాపూర్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం

**పబ్‌పై పోలీసుల మెరుపు దాడులు**

**క్వేక్ అరినా పబ్‌లో ఎనిమిది మందికి పాజిటివ్**

**సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీసుల ఆకస్మిక సోదాలు**

**విదేశీ కళాకారుడికి నెగటివ్ రిపోర్ట్**

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**

నగరంలోని కొండాపూర్ ప్రాంతంలో గల 'క్వేక్ అరినా పబ్'లో జరిగిన డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. టాస్క్ ఫోర్స్ ఈగల్ టీమ్ మరియు సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా ఈ పబ్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించారు.

మిగతా 2లో..





## సీఎం విధానాలపై హరీష్ రావు తీవ్ర విమర్శలు

**కొడంగల్‌లో మీడియా సమావేశం.. ఎస్టీల హక్కులు, హామీల అమలుపై ప్రశ్నలు**

**మెట్రో, ప్రాజెక్టులు, ఉద్యోగాలపై ఆరోపణలు**

2లో

శనివారం - 04 - ఏప్రిల్ 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై కవిత గర్జన

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పెంపు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే యాజమాన్యాలు ఏకపక్షంగా 30 నుండి 40 శాతం ఫీజులు పెంచడం దారుణమన్నారు. ఒకేసారి 60 శాతం ఫీజు కట్టాలని ఒత్తిడి చేస్తూ మధ్యతరగతి కుటుంబాలను ఆగం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, అందుకోసం అవసరమైతే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి బిల్లు పాస్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పాఠశాల విద్య స్వరూపాన్ని వివరిస్తూ, సుమారు 38 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువుతున్నారని కవిత పేర్కొన్నారు. నారాయణ, చైతన్య వంటి 1,200 కార్పొరేట్ విద్యాసంస్థలు ఏటా 1,500 కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నాయని, కానీ పన్నులు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. 2 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలకు 15 వేల రూపాయలు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని ధ్వజమెత్తారు. ఏటా 8 శాతానికి మించి ఫీజులు పెంచకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా పడుతుందని ఆమె హెచ్చరించారు. కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత, ఉపాధ్యాయుల సంక్షేమంపై కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పదివేల మందికి ఒకేచోట వంట చేస్తున్నారని, ఆహార భద్రత విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా వేలాది మంది ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. వెంటనే ఫుడ్ సేఫ్టీ రైడ్స్ నిర్వహించాలని, అలాగే ప్రైవేట్ టీచర్లకు పీఎఫ్, సరైన వేతనాలు అందుతున్నాయో లేదో తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో తెలంగాణ నిరుద్యోగులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఉత్తరాది వారిని తీసుకొచ్చి మన వాళ్లకు అన్యాయం చేసే సంస్థల అనుమతులు రద్దు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 11 వేల కోట్లకు చేరాయని, దీనివల్ల కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని కవిత తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందాల్సిన 212 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై సమీక్ష చేయకపోవడం ముఖ్యమంత్రి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజుల నియంత్రణకు కమిటీ వేయాలని, లేనిపక్షంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్ స్కూళ్ల ముందు భారీ ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

# సీఎం విధానాలపై హరీష్ రావు తీవ్ర విమర్శలు

**కొడంగల్, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విధానాలపై మాజీ మంత్రి టి. హరీష్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కొడంగల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. ఎస్టీల భూములు లాక్కుంటూ మరోవైపు ఇతర రాష్ట్రాల్లో గొప్పలు చెప్పడం సరికాదని ఆయన విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని, కార్పొరేషన్లకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సహాయం, రైతు భరోసా, పింఛన్ల పెంపు వంటి హామీలు అమలు కాలేదని అన్నారు. అసెంబ్లీలో చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్‌గా తేలిపోయిందని పేర్కొన్నారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని, కమీషన్ల కోసం కొత్త ప్రాజెక్టులు తీసుకొస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించలేకపోతుందని అన్నారు. గిరిజనుల అభివృద్ధిలో గత ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని, వేలాది తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిందని గుర్తుచేశారు. ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, పోడు భూముల పట్టాలివ్వడం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు ప్రశ్నించాలని, హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు.

# హైదరాబాద్ కొండాపూర్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

పబ్‌లో డ్రగ్స్ వినియోగం జరుగుతోందన్న ముందస్తు సమాచారంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సోదాలు చేపట్టాయి. ఈ తనిఖీల సమయంలో పబ్‌లో ఉన్న వారిలో సుమారు 64 మంది డ్రగ్స్ తీసుకున్నారన్న అనుమానంతో పోలీసులు వారిని వేరు చేశారు. అక్కడికక్కడే అధునాతన పరీక్షల ద్వారా వారి నమూనాలను సేకరించి తనిఖీలు చేపట్టడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

పోలీసులు వినియోగించిన మూత్ర పరీక్ష పరికరాల ద్వారా జరిపిన తనిఖీల్లో ఎనిమిది మంది వ్యక్తులకు డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. వీరిలో ఐదుగురు గంజాయి సేవించినట్లు నిర్ధారణ కాగా, ఒకరికి బెంజోడియాజెపైన్ అనే మత్తు పదార్థం తీసుకున్నట్లు తేలింది. మరో ఇద్దరు ఏఎంపీ మరియు మెతాంఫెటమైన్ వంటి ప్రమాదకర రసాయన మత్తు పదార్థాలను వినియోగించినట్లు పరీక్షల్లో స్పష్టమైంది. పబ్ లోపల ఇంత భారీ ఎత్తున మాదకద్రవ్యాల వినియోగం జరగడం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది. పబ్ యాజమాన్యం పాత్రపై కూడా పోలీసులు లోతైన విచారణ జరుపుతున్నారు. ఈ దాడుల సమయంలో స్పెయిన్ దేశానికి చెందిన అంతర్జాతీయ కళాకారుడు అలెగ్జాండర్ కూడా అక్కడే ఉన్నారు. అయితే అతనికి జరిపిన పరీక్షల్లో నెగటివ్ రిపోర్ట్ రావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే క్వేక్ అరినా పబ్‌కు చెందిన డీజే కేవీకి కూడా ఎటువంటి మాదకద్రవ్యాల అలవాటు లేదని పరీక్షల్లో తేలింది. అనుమానితులందరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారికి డ్రగ్స్ ఎక్కడి నుండి సరఫరా అయ్యాయి అనే కోణంలో ఆరా తీస్తున్నారు. నగరంలో డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ ఘటన వెలుగు చూడటం గమనార్హం. మత్తు పదార్థాల వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని, పబ్‌లలో ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. పట్టుబడిన ఎనిమిది మందిపై సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నగరంలోని ఇతర పబ్‌లపై కూడా నిఘా పెంచామని, యువతను మత్తుకు దూరం చేసేందుకు నిరంతరం సోదాలు నిర్వహిస్తామని తెలిపారు. కొండాపూర్ పబ్ ఘటనతో నగరంలోని పబ్ నిర్వాహకులలో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది.

# సీఎం పర్యటనకు భారీ స్థాయిలో ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా పిప్రి గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, ప్రేమ్ సాగర్ రావుతో కలిసి సభా ప్రాంగణాన్ని విస్తృతంగా పరిశీలించారు. ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో వేదిక నిర్మాణం, పార్కింగ్, రహదారి సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై చర్చించారు. ముఖ్యంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రతి చిన్న విషయాన్ని కూడా నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సభా ప్రాంగణంలో వైద్య శిబిరాలు, అంబులెన్స్ సౌకర్యం, అగ్నిమాపక దళం సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా గ్రామంలో శుభ్రత, పరిశుభ్రత పనులను కూడా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని అధికారులు సంకల్పం వ్యక్తం చేశారు.

# ..ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి అవసరం

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్రహింపట్నంలో ఏర్పాటు చేసిన ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ పాఠశాలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, విద్యా రంగంలో పరిస్థితులకు అనుగుణంగా సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. ఏఐ ప్రభావం ఎంత తీవ్రమైందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని, పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రతి గ్రామంలో విద్య అందుబాటులో ఉన్నప్పటికీ నాణ్యత లోపిస్తున్నదని, ఈ పరిస్థితిపై ప్రజా ప్రతినిధులు ఆత్మపరిశీలన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వ్యవస్థను బలోపేతం చేసేందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, ఒక్కో పాఠశాలలో 2500 మంది విద్యార్థులు చదివే విధంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 59 పాఠశాలల పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ప్రస్తుతం విద్యా నాణ్యతలో పడిపోతున్న పరిస్థితి ఆందోళనకరమని, మూడో తరగతి విద్యార్థి ఒకటో తరగతి పాఠ్యాన్ని చదవలేని పరిస్థితి, ఆరో తరగతి విద్యార్థి మూడో తరగతి పాఠ్యాన్ని అర్థం చేసుకోలేని స్థితి ఉన్నదని తెలిపారు. ఈ పరిస్థితి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై గణనీయమైన వ్యయం చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం దీనికి నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో పాఠశాలలను పునర్వ్యవస్థీకరించి నమూనా పాఠశాలలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, క్రీడల్లో రాణించిన వారికి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో జరిగే అంతర్జాతీయ క్రీడల్లో దేశం ప్రతిష్ట పెంచే లక్ష్యంతో చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, వేమ నరేందర్ రెడ్డి, రఘునందన్ రావు, చామల కిరణ్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# .. ఏసీబీ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ దాడుల్లో పలు అక్రమాలు వెలుగులోకి రావడంతో అధికార వర్గాల్లో కలకలం రేగింది. ఈ తనిఖీల్లో కార్యాలయం లోపల 20 మంది అనధికార ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా లెక్కల్లో చూపని రూ.47,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ కాని 70 పత్రాలు కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య భారీ లావాదేవీలు జరిగినట్లు వాట్సాప్ చాట్‌ల ద్వారా బయటపడింది. గత ఏడాదిలో రూ.42.03 లక్షల వరకు ఫోన్‌పే ద్వారా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. అలాగే రిజిస్టర్ చేసిన 204 పత్రాలు ఇంకా సంబంధిత వారికి అందించకుండా కార్యాలయంలోనే నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ అంశంపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఇక అధికారుల ఇళ్లలో నిర్వహించిన తనిఖీల్లో రూ.24.61 లక్షల నగదు, 819.5 గ్రాముల బంగారం, 2.6 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా రూ.30.1 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వంకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశముందని, దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

# ..టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉందని, పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం వేగంగా కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. పారదర్శకమైన విధానాల ద్వారా అనుమతులను వేగవంతం చేస్తామని ఆయన పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ద్వారా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని మార్చడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. కేవలం ఫ్యాషన్ మాత్రమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌ల'ను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. యువతకు, ముఖ్యంగా మహిళలకు డిజైన్, కట్టింగ్, స్టిచింగ్ వంటి రంగాల్లో ఆధునిక సాంకేతికతతో శిక్షణ ఇచ్చి వారిని పారిశ్రామిక వేత్తలుగా మారుస్తామన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం తెలంగాణలో తయారైన దుస్తులను ధరించేలా చేయడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన ఆవేశంగా పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం కేవలం టెక్స్‌టైల్స్‌కే కాకుండా సినిమా నిర్మాణానికి కూడా ప్రపంచ కేంద్రంగా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ స్టూడియోలు ప్రారంభించడం దీనికి నిదర్శనమని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ నుంచే అభివృద్ధి చేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. లండన్, పారిస్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాల ఫ్యాషన్ షోల వరకు తెలంగాణ పత్తి చేరాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సదస్సులో మంత్రులు డి. శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు మరియు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. పెట్టుబడిదారులు తెలంగాణను ఒక రాష్ట్రంగా కాకుండా, ఒక నమ్మకమైన భాగస్వామిగా చూడాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ పత్తి పొలాల నుండి లండన్, న్యూయార్క్, మిలాన్ వంటి ప్రపంచ ప్రసిద్ధ ఫ్యాషన్ షోల వరకు మన వస్త్రాలు వెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రపంచ పోటీకి అనుగుణంగా తమ విధానాలను రూపొందిస్తున్నామని, అత్యుత్తమ మానవ వనరుల బలం మన రాష్ట్రానికి ఉందని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు సరైన భాగస్వామిగా ఉంటూ, ప్రపంచాన్ని మార్చగల పూర్తి టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందరూ కలిసి సరికొత్త భవిష్యత్తును నిర్మించాలని, తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రణాళికలు



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎన్డీడీబీ భేటీ
- రాష్ట్రంలో పాడి రంగాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు
- మదర్ డైరీ మరియు ఎన్డీడీబీ అధికారులతో కీలక చర్చలు
- పాల ఉత్పత్తిదారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు చైర్మన్ డాక్టర్ మీనేష్ సి. షా మరియు మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయ తీర్థ చారి ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా పాడి పరిశ్రమను ఏ విధంగా అభివృద్ధి చేయాలి, పాడి రైతులకు మద్దతుగా తీసుకోవలసిన చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న పాడి రంగాన్ని ఆధునీకరించడం ద్వారా పాల ఉత్పత్తిని పెంచాలని, తద్వారా రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవలసిన కీలకమైన అంశాలపై ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ మరియు జాతీయ సంస్థల మధ్య సమన్వయం పెరగాలని, తద్వారా అత్యాధునిక సాంకేతికతను స్థానిక రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని చర్చించారు. ముఖ్యంగా పాల సేకరణ కేంద్రాలను పటిష్టం చేయడం, నాణ్యమైన పశుగ్రాసం పంపిణీ మరియు పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక పథకాలను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. పాడి పరిశ్రమ లాభసాటిగా మారితేనే యువత ఈ రంగం వైపు ఆకర్షితులవుతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక సమావేశంలో భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ చామల, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మరియు ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. సహకార రంగంలో ఉన్న డెయిరీలను బలోపేతం చేయడం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు నేరుగా లబ్ధి చేకూర్చే మార్గాలపై వీరందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మదర్ డైరీ వంటి జాతీయ స్థాయి సంస్థల సహకారంతో తెలంగాణ బ్రాండ్ పాల ఉత్పత్తులను విస్తృతంగా మార్కెట్లోకి తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రతిపాదించారు. తెలంగాణలో పాడి పరిశ్రమను ఒక ప్రధాన ఉపాధి వనరుగా మార్చడమే కాకుండా, వినియోగదారులకు కల్తీ లేని స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్డీడీబీ చైర్మన్ మీనేష్ షా మాట్లాడుతూ, తెలంగాణలో పాడి పరిశ్రమ విస్తరణకు ఉన్న అవకాశాలను ప్రశంసించారు మరియు తమ బోర్డు తరపున పూర్తి సాంకేతిక సహకారాన్ని అందిస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ఈ సమావేశం రాష్ట్ర పాడి పరిశ్రమలో రాబోయే కాలంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని, త్వరలోనే క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రారంభమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రేవంత్ ప్రభుత్వంపై జీవన్ రెడ్డి తిరుగుబాటు

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలన ప్రారంభమై రెండేళ్లు కూడా కాకముందే "ఈ ప్రభుత్వం పోవాలి.. మార్పు రావాలి" అనే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందని ఆయన విమర్శించారు. గతంలో కేసీఆర్ పాలనపై ఉన్న వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని, అయితే ఇప్పుడు అదే తరహా అసంతృప్తి రేవంత్ ప్రభుత్వంపై కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకునే ఉద్దేశంతోనే నామినేటెడ్ పదవుల భర్తీలో కావాలనే జాప్యం చేశారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ పనితీరుపై ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్ని రేపుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని జీవన్ రెడ్డి తప్పుబట్టారు. ప్రాజెక్టుపై కేవలం రాజకీయ విమర్శలు చేయడానికే ప్రభుత్వం పరిమితమైందని, పునరుద్ధరణ పనులపై అసలు దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణకు కేవలం 500 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చవుతాయని, అయినప్పటికీ ప్రభుత్వం జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ నివేదికను అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రాణహిత జలాల వినియోగంపై ప్రభుత్వం విఫలమైందని, బడ్జెట్‌లో కేవలం 152 కోట్ల రూపాయలు కేటాయించడం రైతాంగం పట్ల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ఆయన ధ్వజమెత్తారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టకపోతే భారీ నష్టం వాటిల్లుతుందని జీవన్ రెడ్డి హెచ్చరించారు. సుమారు 18 లక్షల ఎకరాల సాగుభూమి ఎడారిగా మారే ప్రమాదం ఉందని, అలాగే హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి కేవలం రాజకీయ కక్ష సాధింపులకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందితే రాబోయే రోజుల్లో ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రైతాంగం ప్రయోజనాల కోసం తాము ఎల్లప్పుడూ పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. తన భవిష్యత్ రాజకీయ నిర్ణయాలపై స్పందిస్తూ జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటానని, తనపై భారతీయ జనతా పార్టీ మరియు బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. మరో రెండు వారాల్లో తాను ఏ పార్టీలో చేరబోతున్నానో అధికారికంగా ప్రకటిస్తానని స్పష్టం చేయడంతో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడటం దాదాపు ఖాయమని తెలుస్తోంది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడు పార్టీని వీడితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బ తగిలే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన నిర్ణయం కోసం రాజకీయ వర్గాలన్నీ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

# ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పేరు వివాదం

- రాజకీయాలకు బలి కాకూడదని ఎమ్మెల్యే హెచ్చరిక
- బండారి రాజిరెడ్డి సేవలకు గుర్తింపుగా పేరు
- మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై తీవ్ర స్పందన




**ఉప్పల్, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు దివంగత నేత బండారి రాజిరెడ్డి పేరు పెట్టడంపై రాజకీయ వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్రంగా స్పందించారు.కాప్రా ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం ఒక వ్యక్తి పేరుకి పరిమితం కాదని, అది ఆయన చేసిన సేవలకు నిలువెత్తు గుర్తింపని అన్నారు. ప్రజల భావోద్వేగాలతో ఆటలాడే రాజకీయాలకు ఇది వేదిక కావొద్దని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించడం పట్ల తీవ్రంగా ఖండించారు. బండారి రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు.అలాగే, నియోజకవర్గ అభివృద్ధికి రూ.150 కోట్లతో సిఆర్ఎంపి నిధులు మంజూరయ్యాయని, రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సంబంధిత మంత్రితో చర్చించి పనులు ఆమోదింపజేసినట్లు చెప్పారు.బీజేపీ మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై స్పందిస్తూ, అటల్ బిహారీ వాజపేయి వంటి మహానేతల పట్ల తమకు గౌరవం ఉందని, ఆయన పేరును జాతీయ రహదారికి పెట్టాలని సూచించారు. అయితే ఒక్కరే వ్యతిరేకించడం వెనుక ప్రజా హితం లేదని, రాజకీయ లాభాలే ఉన్నాయని ఆరోపించారు.ఇంకా ఘాటుగా స్పందిస్తూ, తాను ఎప్పుడూ అక్రమాలకు పాల్పడలేదని, పార్కుల కబ్జాలు తన రాజకీయాల్లో లేవని విమర్శించారు.దివంగత బండారి రాజిరెడ్డి ప్రజల కోసం జీవించిన నాయకుడని, ఆయన పేరును వ్యతిరేకించడం ప్రజల మనోభావాలను అవమానించడమేనని అన్నారు ."అభివృద్ధికి రాజకీయ రంగు వేయొద్దు... ప్రజల భావోద్వేగాలతో ఆటలాడొద్దు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం కృషి చేస్తాం" అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.



## శ్రీరామ్ రెస్టారెంట్ ప్రారంభం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

**చర్లపల్లి, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు ):**

చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో శ్రీరామ్ బేకరీ అధినేత విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రీరామ్ రెస్టారెంట్"ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏసీపీ గణేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సాయి జన్ శేఖర్, చర్లపల్లి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు మహేష్ గౌడ్, మురళి పంతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రముఖులు విజయ్ కుమార్ రెడ్డిని అభినందించి, ఆయనకు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ ప్రతిమను బహుకరించారు. వ్యాపార రంగంలో మరింత ఎదగాలని ఆకాంక్షించారు.ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు.

# మాజీ ఎమ్మెల్యేపై వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన దిష్టిబొమ్మ దహనం

- వాజపేయి పేరుతో కారిడార్‌కు డిమాండ్

**నాచారం, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

మాజీ శాసనసభ్యులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్‌పై ప్రస్తుత శాసనసభ్యుడు బండారి లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు పరస్పరం గౌరవం పాటించాల్సిన అవసరం ఉందని, వ్యక్తిగతంగా దూషణలు చేయడం తగదని అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు.అదే విధంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణంలో ఉన్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాజపేయి దేశానికి చేసిన సేవలను గుర్తుచేస్తూ ఆయన పేరును ప్రాజెక్టుకు ఇవ్వడం సముచితం అని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు సంగిశెట్టి రవీంద్రసాగర్, గోపి, అపర్ణ గౌడ్, మంజులవాణి, సబితా యాదవ్, లింగం గౌడ్, నరేష్, శ్రీనివాస్, కురుమ ఆనంద్, మధు తదితర బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.నిరసన కార్యక్రమం సందర్భంగా కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.






## ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లో శుభ్రత

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భద్రతపై దృష్టి

**కాప్రా, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కాప్రా పరిధిలో ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టుపక్కల ఉన్న చెత్త చెదారం, నిర్మాణ వ్యర్థాలు మరియు పిచ్చి మొక్కలను తొలగించారు.ఈ కార్యక్రమం లో కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, డీఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రవి, సానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్లు రామకృష్ణ, శ్రీనివాస్, వసంత్ కుమార్‌తో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.అధికారులు తెలిపారు .ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లో




చెత్త పేరుకుపోవడం వల్ల అగ్ని ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అందుకే ఈ శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇలాంటి పరిస్థితులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే అవకాశముందని నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు. ఇకపై ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శుభ్రతను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని అధికారులు వెల్లడించారు.

# ప్రజాపాలనకు నిదర్శనం-లబ్ధిదారుల ఇంటికే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- మోజర్ల సర్పంచ్ చంద్రశేఖర్

**పెద్దమందడి,ఏప్రిల్3(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామంలో ప్రజాపాలనకు నిదర్శనంగా ఒక అభినందనీయ కార్యక్రమం నిర్వహించబడింది. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ కె చంద్రశేఖర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల యోగక్షేమాలను తెలుసుకుంటూ వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.దాసరి ప్రసాద్, దాసరి



శ్రీనివాసులు, వడ్డే కుర్మమ్మ, గడ్డం లక్ష్మి, గట్టు అలివేలమ్మ, మద్దెల సాయమ్మ, రాయకంటి రాములు, కావాలి రేణుక, దాసరి జయమ్మలకు చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె చంద్రశేఖర్‌తో పాటు వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు కొత్తకాపు రామకృష్ణరెడ్డి, రగ్మారెడ్డి, వార్డు సభ్యులు సింగం కృష్ణయ్య, రాయికంటి రాములు, కె సత్యరెడ్డి, మనోహర్ రెడ్డి, గట్టు ధనుజయ్, గట్టు మన్యం, గట్టు రాజు, కె నాగన్న, కె కురుమయ్య, నెల్లి తిరుపతి, భూపని అంజి, సింగం నరసింహ, డి రాములు, కె కురుమూర్తి, ఎస్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.ప్రజలకు చేరువగా ఉండే విధంగా ప్రభుత్వ సహాయాన్ని నేరుగా అందజేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఎర్రకుంట స్మశాన వాటికకు నూతన కమిటీ

- బస్తి వాసుల ఏకగ్రీవ నిర్ణయం
- అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఉప్పల్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలో ఎర్రకుంట లోని హిందూ స్మశాన వాటిక అభివృద్ధి, నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయాలనే ఉద్దేశంతో స్థానిక బస్తి వాసులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కమిటీ ఏర్పాటుపై చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు.నూతన కమిటీలో శ్రీమూర్తి నాగరాజును అధ్యక్షుడిగా, ఎడ్ల కార్తీక్‌ను ప్రధాన కార్యదర్శిగా, కొమ్మగాళ్ల కౌశిక్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నారు. స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశుభ్రత నిర్వహణ, ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు .ఈ సమావేశంలో పాల్గొన్న ఎర్రకుంట బస్తి నివాసులు నూతన కమిటీకి అభినందనలు తెలుపుతూ, అభివృద్ధి కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.





## దొడ్డి కొమరయ్య 99వ జయంతి వేడుకలు

- సాయుధ పోరాటానికి స్ఫూర్తిదాయకమైన అమరవీరునికి నివాళులు

**ఏ ఎస్ రావు నగర్, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం కమలానగర్ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 99వ జయంతి సందర్భంగా సంస్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమం ప్రారంభంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి ప్రముఖ దంత వైద్యులు నరసింహ, భవన నిర్మాణ కార్మిక జిల్లా నాయకులు అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాట ప్రారంభ దశలో విసునూరు దేశముఖ్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం జరిగిన పోరాటంలో దొడ్డి కొమరయ్య చేసిన త్యాగం చారిత్రాత్మకమని తెలిపారు. ఆయన వీరమరణం తెలంగాణ వ్యాప్తంగా రైతాంగాన్ని సాయుధ పోరాటానికి ప్రేరేపించిందని అన్నారు.నిజాం పాలనలో జమీందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటం దేశవ్యాప్తంగా భూ ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. దొడ్డి కొమరయ్య, బందగి వంటి అమరవీరుల త్యాగఫలితంగా బెంగాల్‌లో తేబాగా ఉద్యమం, మహారాష్ట్రలో వర్లీ పోరాటం, కేరళలో పున్నప్రవయలార్ పోరాటాలు వెలుగులోకి వచ్చాయని వివరించారు.మాజీ కౌన్సిలర్ చల్లా లీలావతి మాట్లాడుతూ సాయుధ పోరాట విశిష్టతను వివరించి, భూమి కోసం భుక్తి కోసం సాగిన పోరాటాలపై ప్రేరణాత్మక గీతాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, జి. శివరామకృష్ణ, లక్ష్మయ్య, గుమ్మడి హరిప్రసాద్, రోజారాణి, గౌసియా, శశిధర్ రెడ్డి, శివన్నారాయణ, ఎం. భాస్కర్ రావు, బంగారు నర్సింగరావు, శ్రీనివాస్, జయరాజ్, నవతెలంగాణ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ బి నగర్‌లో దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణ

– ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని నివాళులు
– వీరుల త్యాగాలు తరతరాలకు చేరాలన్న పిలుపు

**ఎల్ బి నగర్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు ) :**

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 99వ జయంతి సందర్భంగా ఎల్బీ నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, ఏ కులమైనా, ఏ జాతైనా తమ గొప్పతనాన్ని, త్యాగాలను గుర్తు చేసుకోకపోతే రాబోయే తరాలకు అవి తెలియవని అన్నారు. నిజాం పాలనలో జరిగిన దోపిడి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు అర్పించిన మహనీయుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన చుక్క సత్తన్న సేవలను కూడా ఆయన స్మరించారు.మారుతున్న కాలంలో కూడా తమ సంస్కృతిని కాపాడుకుంటున్న కురుమ జాతి ఐక్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వెంకటేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సామ రంగారెడ్డి, జాజుల శ్రీనివాస్ గౌడ్, కొప్పుల నరసింహారెడ్డి, శ్యామ్, ఆదికృష్ణ, వెంకన్న, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# డీసీసీ సెక్రటరీగా బక్కని నర్సింగ్ రావ్ నియామకం

- పార్టీ బలోపేతంతో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తానని హామీ

**కీసర, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా డీసీసీ సెక్రటరీగా బక్కని నర్సింగ్ రావ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలియజేసి సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా కార్యవర్గంలో చోటు దక్కడం గౌరవంగా భావిస్తున్నానని నర్సింగ్ రావ్ తెలిపారు.పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ప్రజల అభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కీసర మండల నాయకులు జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించినందుకు నర్సింగ్ రావ్ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు శివలింగాల శ్రీనివాస్ గౌడ్, ఏలూరి శ్రీనివాస్ ముదిరాజ్, యువనేత వల్లాల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్త కమిటీతో అభివృద్ధి పథంలో వడ్డెర సంఘం

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎల్కతుర్తి మండలంలో వడ్డెర సంఘం నూతన కమిటీ ఏర్పాటుతో సంఘం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. రాష్ట్ర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు శివరాత్రి ఐలుమల్లు ఆదేశాల మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి పల్లపు వెంకటేష్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు వల్లెపు సుధాకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఈ కమిటీని నియమించారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా గొల్లన ఎల్లయ్యను, ఉపాధ్యక్షులుగా బొంత కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీతో సంఘం మరింత బలోపేతం అవుతుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన అధ్యక్షుడు గొల్లన ఎల్లయ్య మాట్లాడుతూ, వడ్డెర సమాజ అభివృద్ధి కోసం కట్టుబడి పని చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా కృషి చేస్తామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉపాధ్యక్షుడు బొంత కుమారస్వామి మాట్లాడుతూ, సంఘ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని, సభ్యులందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బొంత రమేష్ (సర్పంచ్, రామకృష్ణాపూర్), గొల్లైన సదానందం, ఓర్సు శీను, బొంత బిక్షపతి, గొల్లెన కుమార్, ఆలకుంట కుమారస్వామి, బొంత కుమార్, గొల్లన బిక్షపతి, సూరా రవి, సురా సాంబరాజు, దండుగుల జంపయ్య, వల్లేపు ప్రశాంత్, బొంత తిరుపతి, బొంత రవీందర్, బొంత రాజకొమురయ్య, వల్లెపు సతీష్, ఆలకుంట రమేష్ తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి సభ్యుల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. వడ్డెర సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ సామాజిక, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు వెల్లడించారు.



## ట్రాఫిక్ అస్తవ్యస్తం తక్షణమే సిబ్బంది నియామకానికి ప్రజల డిమాండ్

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 03( తెలంగాణ ముచ్చట్లు):**

ఎల్కతుర్తి బస్టాండ్ సర్కిల్ మరియు చౌరస్తా ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ గందరగోళంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు, ఇతర వాహనాలు రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ఎంట్రీ-ఎగ్జిట్ నియమాలు పాటించకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు రోజురోజుకు పెరుగుతోంది. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సుల ఇష్టారీతిన రాకపోకలు పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చుతున్నాయి. పాదచారులు రహదారులు దాటే సమయంలో ప్రాణాలు పణంగా పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కొన్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పటికీ, సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక చౌరస్తాలో సరైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం, ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడం వల్ల వాహనదారులు ఇష్టారాజంగా రాంగ్ రూట్ లో ప్రయాణిస్తున్నారు. రాత్రి వేళల్లో లైటింగ్ సౌకర్యం తక్కువగా ఉండటంతో ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోంది.

ఈ నేపథ్యంలో వెంటనే ట్రాఫిక్ సిబ్బందిని నియమించి, స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటేనే ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఐపీఎల్ 2026 మ్యాచ్‌లకు ఉప్పల్ స్టేడియంలో కట్టుదిట్టమైన భద్రత

- ఇంచార్జ్ సీపీ సుధీర్ బాబు సమీక్ష
- 3 వేల మంది పోలీసులతో బందోబస్తు, 450 సీసీటీవీ కెమెరాల ఏర్పాటు

**ఉప్పల్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**





రాబోయే ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల నేపథ్యంలో ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేస్తున్నారు. ఈ మేరకు ఇంచార్జ్ సీపీ సుధీర్ బాబు (ఐపీఎస్) శుక్రవారం స్టేడియాన్ని సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాచ్‌ల నిర్వహణ కోసం సుమారు 3,000 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆక్టోపస్, స్పెషల్ బ్రాంచ్, క్రైమ్ టీమ్స్ సంయుక్తంగా భద్రతను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. స్టేడియం లోపల మరియు బయట కలిపి మొత్తం 450 సీసీటీవీ కెమెరాలను అమర్చి, వాటి పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని షీ టీమ్స్‌ను ప్రత్యేకంగా మోహరించనున్నట్లు పేర్కొన్నారు. స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ నివారించేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తూ, ప్రేక్షకులు నిర్ణీత సమయానికి ముందే స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రేక్షకుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మెట్రో రైలు సర్వీసులను అర్ధరాత్రి వరకు నడపాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.అలాగే స్టేడియంలోకి నీళ్ల సీసాలు, తినుబండారాలు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, పవర్ బ్యాంకులు, సిగరెట్లు, లైటర్లు, అగ్గిపెట్టెలు, పదునైన వస్తువులు, హెల్మెట్లు, బ్యాగులు, బ్యానర్లు వంటి నిషేధిత వస్తువులను తీసుకురాకూడదని స్పష్టం చేశారు.భద్రతా తనిఖీలకు ప్రతి ఒక్కరూ సహకరించి, శాంతియుత వాతావరణంలో క్రికెట్ మ్యాచ్‌లను ఆస్వాదించాలని సుధీర్ బాబు కోరారు.

# పేదల ముఖాల్లో చిరునవ్వులు నింపుతున్న ఇందిరమ్మ రాజ్యం

- పెద్దమందడిలో సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**పెద్దమందడి,ఏప్రిల్3(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆదరణగా ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నాయకులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు లబ్ధిదారులకు ఈ సహాయం అందించడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పనితీరుపై ప్రశంసలు వెల్లువెత్తాయి.అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలనే లక్ష్యంతో వేగంగా స్పందిస్తూ చెక్కులు మంజూరు చేయిస్తున్న తీరు అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కారం చూపించే నాయకత్వం నియోజకవర్గానికి గర్వకారణమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఐ సత్యరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, ఉప సర్పంచ్ బోయిని ఉషన్న యాదవ్, సూర్య రవి, సీనియర్ నాయకులు పల్లె సత్యనారాయణ, వాకిటి నరేష్, ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాఘవేంద్ర, గట్టు రాజశేఖర్, జంగం శివ, కురుమన్న, అశోక్, దర్శన్, వెంకటన్న, శ్రీను, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ భావోద్వేగాలను వ్యక్తం చేస్తూ ఆపద సమయంలో ఆదుకున్న ప్రభుత్వం తమకు దైవసమానమని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు భరోసా కలుగుతోందని, శాసనసభ్యుల చొరవతో తమకు ఆర్థికంగా ఉపశమనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు.ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పేదల పక్షాన నిలిచే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు.

# హుజూరాబాద్ సిఎస్ఐ చర్చిలో సిలువ ధ్యానాల పండుగ ఘనంగా నిర్వహణ





**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో ఈరోజు సిలువ ధ్యానాల పండుగ ఎంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రెవరెండ్ ఈసంపల్లి జాన్ బాబు పాస్టర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభువైన యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు అమూల్యమైన మాటలను విశదీకరిస్తూ ప్రత్యేక స్తోత్రాలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రెవరెండ్ జాన్ బాబు గారు వాక్య సందేశం అందిస్తూ, యేసు ప్రభువారి త్యాగం, ప్రేమ, క్షమాగుణాల ప్రాముఖ్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఫాస్ట్‌రేట్ చైర్మన్‌గా ఉన్న రెవరెండ్ జాన్ బాబు గారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే ఫాస్ట్‌రేట్ ఉమెన్స్ చైర్మన్ విజయమ్మ గారు, ఫాస్ట్‌రేట్ సెక్రటరీ సొల్లు బాబు, గూడెపు రవీందర్, ఎస్ మహేందర్, అమర్లపూడి శరన్ కుమార్, వై రవికుమార్, సొల్లు సునీత, జి సురేఖ, జి హిమవంతు, వై పుష్పలత, ది రాణి బాబు, కడారి అనుష, శంకర్, ఆర్ ప్రమోదిత, స్వామిదాస్, బి కనకలక్ష్మి, ఏ ప్రభావతి, ఏ ప్రియాంక, కే సబిత, కే రాజేశ్వరి, ధరణి, కె రజిత, సంపత్, జి కాంతా, ఎన్ పద్మ, ఎన్ ఝాన్సీ, ప్రియ, కె శైలజ, ఏ శ్రీలత, రంజిత్ కుమార్, ఎస్ స్రవంతి, ఈ బ్యూలా, కె సుశీల, కే సుకన్య, టి లలిత, కే ఆశీర్వాద, ఏ ఏలియా, నీలమ్మ, ఆకునూరి అర్చన, సిద్ధూ తదితరులు హాజరయ్యారు.

ఈ ధ్యానాల కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రార్థనలు చేసి ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు.

# డంపింగ్ యార్డ్ వ్యతిరేకంగా హుజురాబాద్ బంద్ విజయవంతం



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణ శివారులో డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చిన బంద్ విజయవంతమైంది. బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపడంతో వ్యాపార సంస్థలు, వాణిజ్య దుకాణాలు పూర్తిగా మూతపడ్డాయి. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద టీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. జనావాసాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయవద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం ఆటలు ఆడకూడదని హెచ్చరించారు. నివాస ప్రాంతాల సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# ర్యాలీతో రగిలిన నిరసన.. హుజురాబాద్ బంద్‌కు కెమిస్ట్ & డ్రగిస్ట్ అసోసియేషన్ మద్దతు




**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** సిర్సపల్లి డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పిలుపునిచ్చిన హుజురాబాద్ బంద్‌కు స్థానిక కెమిస్ట్ & డ్రగిస్ట్‌ల అసోసియేషన్ ఘన మద్దతు తెలిపింది. పట్టణంలోని సూపర్ బజారు నుంచి ర్యాలీగా బయలుదేరిన సభ్యులు నినాదాలతో ముందుకు సాగుతూ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరానికి చేరుకుని తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ ర్యాలీలో పాల్గొన్న వ్యాపారులు “జనావాసాల్లో డంపింగ్ యార్డ్ వద్దు”, “ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడొద్దు” అంటూ ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. బంద్‌కు తమ పూర్తి సహకారం అందిస్తూ వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు.

కెమిస్ట్ & డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు కర్ర పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం శ్రీనివాస్, చింతకుంట శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, దాసి కుమారస్వామి, ఎనిమిళ్ల శ్రీనివాస్, ముక్కెర కనుకయ్య, భరణి, తిరుపతి, పిట్ట శ్రీనివాస్, ముక్క రమేష్, దొండ నాగరాజు, సంపత్, వేముల రాజేశం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అదేవిధంగా RMP డాక్టర్స్ అసోసియేషన్ నుండి కందకట్ల శ్రీనివాస్, చిలుకమరి శ్రీనివాస్, అలాగే ల్యాబ్ అసోసియేషన్‌కు చెందిన దేవేందర్ పాల్గొని నిరసనకు బలాన్ని చేకూర్చారు. విభిన్న వర్గాల ఐక్యతతో హుజురాబాద్ బంద్ విజయవంతంగా కొనసాగింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శనివారం - 4- ఏప్రిల్ 2026
వరంగల్




# హెచ్ఎంటి నగర్‌లో ఉద్రిక్తత..

- ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనంపై బీఆర్ఎస్ ఆందోళన
– పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

**నాచారం, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్ఎంటి నగర్ ప్రాంతంలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు హెచ్ఎంటి నగర్ కమాన్ వద్ద ధర్నా నిర్వహించారు. మూడు డివిజన్లకు చెందిన సుమారు 12 మంది నాయకులు పాల్గొని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గోపాల్ గౌడ్ నేతృత్వంలో ఎమ్మెల్యే పై తీవ్ర విమర్శలు గుప్పించారు. అలాగే ఎమ్మెల్యేను నియోజకవర్గంలో తిరగనీయమంటూ హెచ్చరికలు చేయడం వివాదాస్పదంగా మారింది.ఈ ఘటనపై స్పందించిన నాచారం, హెచ్ఎంటి నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని గోపాల్ గౌడ్‌పై ఫిర్యాదు చేశారు. ఆయన తరచూ అకారణంగా గొడవలు సృష్టిస్తూ నాచారం ప్రాంతంలోని ప్రశాంత వాతావరణాన్ని భంగం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఫిర్యాదు స్వీకరించిన ఇన్స్పెక్టర్ ధనుంజయ గౌడ్, లీగల్ ఒపీనియన్ తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ముందు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ ఘటనతో ఉప్పల్ పరిధిలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.



# తొలి అమరవీరునికి ఘన నివాళి

- జమ్మికుంటలో గంభీరంగా జయంతి వేడుకలు.

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంటలో తెలంగాణ గర్వకారణమైన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు భావోద్వేగభరితంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంట MRO కార్యాలయం ఈ సందర్భంగా స్ఫూర్తి వేదికగా మారింది.
మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) కార్యక్రమానికి హాజరై, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి వినమ్ర నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడిన ఆయన, నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచి రైతాంగ హక్కుల కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు.
"వెట్టి చాకిరీ, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన ధైర్యం ప్రతి తరానికి మార్గదర్శకం... ఆయన త్యాగం మనకు నిత్య స్ఫూర్తి" అని పేర్కొన్నారు. సమాజంలో న్యాయం, సమానత్వం కోసం ఆయన చూపిన దారిలోనే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అమరుడికి ఘనంగా నివాళులు అర్పించారు. జమ్మికుంటలో ఈ వేడుకలు స్ఫూర్తి జ్యోతిని మరలా వెలిగించినట్టుగా నిలిచాయి.



# త్యాగం – క్షమ సందేశంతో గుడ్ ఫ్రైడే

_జమ్మికుంటలో ఆధ్యాత్మిక వాతావరణం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో గూడ్ ఫ్రైడే సందర్భంగా గేత్సమనే ప్రార్థన మందిరం భక్తి, భావోద్వేగాలతో నిండిపోయింది. క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేపట్టి, నిశ్శబ్దం మధ్య సాగిన ప్రార్థనలతో ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.
ఈ సందర్భంగా పాస్టర్ జోజీ ఇచ్చిన సందేశం భక్తులను లోతుగా ఆలోచింపజేసింది. "యేసు క్రీస్తు శిలువ త్యాగం మనకు ప్రేమ, క్షమ, కరుణ యొక్క నిజమైన అర్థాన్ని తెలియజేసింది... శత్రువుల పట్ల కూడా క్షమ చూపగలిగితేనే మనిషి గొప్పవాడు అవుతాడు" అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, మానవతా విలువల కోసం యేసు క్రీస్తు తన ప్రాణాలను అర్పించిన ఈ పవిత్ర దినం విశిష్టతను ఆయన వివరించారు.
ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు నిశ్శబ్దంగా, ఆత్మపరిశీలనతో గడుపుతూ ఆధ్యాత్మిక శాంతిని అనుభవించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా జమ్మికుంటలో ఏర్పడిన ఈ భక్తి వాతావరణం ప్రతి ఒక్కరి హృదయాలను తాకింది.





# గుంతల గుప్పెట్లో జమ్మికుంట రోడ్లు

_అధికారులకు చైర్మన్ అలర్ట్

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో రోజురోజుకూ దిగజారుతున్న రహదారి పరిస్థితులపై మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) గట్టిగా స్పందించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, ఫ్లైఓవర్ బ్రిడ్జి పై ఏర్పడిన గుంతలు, కొత్తపల్లి కెనాల్ సమీపంలోని ప్రమాదకర పరిస్థితులను ఆర్&బీ డిఇ. దృష్టికి తీసుకెళ్లారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను ప్రత్యక్షంగా చూపిస్తూ, ఇటీవల బ్రిడ్జి దెబ్బతిన్న పరిస్థితిని వివరించారు. ముఖ్యంగా కొత్తపల్లి కెనాల్ వద్ద పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారిందని, రోజూ వందలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఎప్పుడైనా ప్రమాదాలు సంభవించే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు... ముందుగానే చర్యలు తీసుకోవడం ముఖ్యం" అంటూ అధికారులను హెచ్చరించారు. రోడ్లు, బ్రిడ్జి మరమ్మతులను తక్షణమే చేపట్టి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్ బత్తుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# అపర భద్రాద్రిలో చంద్ర రథోత్సవం సందడి... భక్తులకు మహా దర్శనోత్సవం సిద్ధం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**



ఇల్లందకుంటలోని అపర భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా అత్యంత ముఖ్య ఘట్టమైన చంద్ర రథోత్సవం (పెద్ద రథం) నిర్వహణకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.
ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు, కార్యనిర్వాహణ అధికారి సుధాకర్ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.
భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, ఎండ నుండి రక్షణకు వైట్ పాండాలు, త్రాగునీటి సదుపాయం, ప్రాథమిక వైద్య సేవలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు స్వామివారు చంద్ర రథంపై ఆశీనులై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.
అనంతరం మధ్యాహ్నం 4 గంటల తరువాత ఒగ్గు కళాకారుల ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనుండగా, భక్తుల జయజయ ధ్వానాల మధ్య పెద్ద రథోత్సవం దేవస్థానం మాడవీధుల గుండా ఘనంగా ఊరేగింపుగా సాగనుంది.
ఈ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని ఆలయ అధికారులు కోరారు. దేవస్థానానికి వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోడిశాల పరమేష్, కిరణ్, చిరంజీవి, గోపాల్ కిషన్, ఆలయ అధికారులు మోహన్, సురేందర్, మల్లారెడ్డి, గ్రామ ప్రజలు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిఐడి షాక్ వేవ్... జమ్మికుంటలో చైర్మన్ అరెస్ట్‌తో సంచలనం!

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై సిఐడి విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో జమ్మికుంటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితులు అదుపులో ఉండేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
అరెస్ట్ అనంతరం స్పందించిన చైర్మన్, "మా ఎమ్మెల్యేపై జరుగుతున్న సిఐడి విచారణ బాధాకరం. ఇది రాజకీయ ప్రేరేపిత చర్యలా కనిపిస్తోంది. అయినా మేము వెనక్కి తగ్గేది లేదు... ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా మా నాయకుడి వెంటనే నిలబడతాం" అని స్పష్టం చేశారు.
ఈ ఘటనలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు ఫిరోజ్, మంద రాజేష్ తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.
ఒక్కసారిగా చోటుచేసుకున్న ఈ పరిణామంతో జమ్మికుంటలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని పర్యవేక్షిస్తూ పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.



# ఘనంగా సింగపురం దయాకర్ జన్మదిన వేడుకలు



**స్టేషన్ ఘనపూర్,ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):**
స్టేషన్ ఘనపూర్ మాజీ ఎంపిటిసి, ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షుడు సింగపురం దయాకర్ జన్మదిన వేడుకలు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దయాకర్ చే కేకు కోయించి ,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దయాకర్ ప్రజలకు సేవ చేస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.
కాంగ్రెస్ నాయకులు రాజరపు జయపాల్, సింగపురం ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య (బలగం), సింగపురం కిట్టు, సింగపురం ప్రశాంత్, చింత రవి, చింత ప్రవీణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- 34 మందికి రూ.10.56 లక్షల సహాయం
- సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జారె సూచన

**అశ్వారావుపేట, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో దమ్మపేట మండలానికి చెందిన 34 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.10,56,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని కుటుంబ అవసరాల కోసం సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనారోగ్యంతో ఎవరైనా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. పేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో అత్యవసర శస్త్ర చికిత్సలు రూ.30 లక్షల వరకు పూర్తిగా ఉచితంగా చేయించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాకా రమేష్, ఎర్రా వసంతరావు, వాసం శ్రీనివాసరావు, పగడాల రాంబాబు, సర్పంచులు మోకాళ్ల గురుమూర్తి, పగడాల రమాదేవి, గుజ్జుల శ్రీనివాసరావు, కూరం అర్జున్‌రావు, బొల్లికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 46 కిలోల గంజాయి స్వాధీనం ఇద్దరు అరెస్ట్

**స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 3: తెలంగాణ ముచ్చట్లు**

ఘనపూర్ పోలీసుల అప్రమత్తతతో భారీగా గంజాయి పట్టుబడింది. శుక్రవారం మధ్యాహ్నం 2:30గంటల సమయంలో, ఘనపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఉప నిరీక్షకుడు రాజేష్ పిట్ట తన సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహిస్తుండగా, ఘనపూర్ రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక పురుషుడు మరియు ఒక మహిళను గమనించారు. పోలీసులను చూసిన వెంటనే వారు అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటనే వెంటపడి వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద ఉన్న 5 సంచుల్లో సుమారు 46.85 కిలోల గంజాయి




లభించింది.
విచారణలో నిందితులు తమ పేర్లు సత్యరంజన్ బారెల్ మరియు దీప్తి మాయి స్వైన్ అని తెలిపి, ఈ గంజాయిని భువనేశ్వర్ నుండి ముంబయిలోని దాదర్ ప్రాంతానికి అక్రమంగా తరలించి విక్రయించాలనే ఉద్దేశంతో తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు.
ఈ ఘటనపై శిక్షణలో ఉన్న భారత పోలీసు సేవాధికారి మణీషా నెహ్రా ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు.

**పోలీసులు నిందితుల వద్ద నుండి:**

46.4 కిలోల గంజాయి
2 చేతి దూరవాణి పరికరాలు
రూ. 2,690 నగదు
రైల్వే ప్రయాణ టికెట్
స్వాధీనం చేసుకున్నారు.
నిందితులను 03042026న న్యాయస్థానంలో హాజరుపరచగా, నిర్బంధానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



# దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఘన నివాళులు

_విగ్రహానికి పూలమాలలు
– రాష్ట్ర నాయకుల పాల్గొనరు

**మల్లాపూర్, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు, రైతుబిడ్డ దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా స్థానికంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు, రైతుల కోసం చేసిన పోరాటం చిర స్మరణీయమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తాడూరి శ్రీనివాస్, సంగిశెట్టి రవీంద్రసాగర్, ఎనుముల మహేష్‌కుమార్, దొడ్డి యాదగిరి, కంది రాములు, రాజేశ్వర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం గౌరవప్రద వాతావరణంలో కొనసాగింది.

# కరుణాపురంలో యేసు పరిశుద్ధ సిలువ మార్గ యాత్ర



**ధర్మసాగర్,ఏప్రిల్03(తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా పరిశుద్ధ సిలువ మార్గ యాత్ర ఘనంగా నిర్వహించబడింది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. విచారణ గురువు ఫాదర్ సుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహించారు.
సిలువ యాత్రలో బైరపాక భార్గవ్ యేసు ప్రభువు వేషధారణలో పాల్గొని యాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఫాదర్ సుధాకర్ మాట్లాడుతూ, గుడ్ ఫ్రైడే అనేది త్యాగం, సహనం, ప్రేమకు ప్రతీక అని తెలిపారు. యేసు ప్రభువు మానవాళి కోసం అనుభవించిన కష్టాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని, సమాజంలో శాంతి, సహన భావాలు పెరగాలని ఆకాంక్షించారు. పరస్పర సహకారం, ప్రేమతో జీవించడం ద్వారానే సమాజంలో నిజమైన ఆనందం సాధ్యమని అన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్, గ్రామ పెద్దలు, సెయింట్ అగస్టిన్స్ యూత్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# రేంజ్ రోవర్ కార్లపై భారీ డిస్కౌంట్..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):
భారత్‌యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రభావంతో లగ్జరీ కార్ల మార్కెట్‌లో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యంగా రేంజ్ రోవర్ కార్ల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి.
జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం యూకే నుంచి పూర్తిస్థాయిలో దిగుమతి అయ్యే టాప్‌ఎండ్ మోడళ్లపై ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది. దిగుమతి సుంకం 110 శాతం నుంచి 30 శాతానికి తగ్గించడంతో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయి.



దీంతో హైఎండ్ మోడళ్లైన రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీ, ఎస్‌వీ ఎడిషన్ వంటి వేరియంట్ల ధరలు 13 నుంచి 25 శాతం వరకు తగ్గనున్నాయి. ప్రస్తుతం రూ.2.75 కోట్లుగా ఉన్న ఒక మోడల్ ధర సుమారు రూ.2.35 కోట్లకు చేరే అవకాశం ఉండగా.. రూ.4.25 కోట్ల విలువైన టాప్ మోడల్ ధర దాదాపు రూ.3.19 కోట్లకు పడిపోవచ్చని అంచనా.
అయితే ఈ ధరల తగ్గింపు అన్ని మోడళ్లకు వర్తించదు. భారత్‌లోనే అసెంబుల్ చేసే సీకేడీ యూనిట్లకు ఈ ప్రయోజనం ఉండదు. అలాగే ఇతర దేశాల్లో తయారయ్యే కొన్ని మోడళ్లపై కూడా ప్రభావం ఉండదని కంపెనీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం భారత లగ్జరీ కార్ల మార్కెట్‌లో జేఎల్ఆర్‌కు మంచి వాటా ఉంది. ఈ తాజా ధరల తగ్గింపుతో మెర్సిడెస్‌బెంజ్, బీఎండబ్ల్యూ వంటి పోటీ సంస్థలకు గట్టి సవాల్ విసిరే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

# గ్రాట్యుటీ రూల్స్‌లో కీలక మార్పులు..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రైవేట్, ప్రభుత్వ రంగ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. కొత్త లేబర్ కోడ్స్ అమల్లోకి రావడంతో గ్రాట్యుటీ నిబంధనల్లో ముఖ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ఒకే సంస్థలో కనీసం ఐదేళ్లు పనిచేస్తేనే గ్రాట్యుటీ పొందే అవకాశం ఉండేది. అయితే ఇప్పుడు కొన్ని కేటగిరీల ఉద్యోగులకు కేవలం ఒకే ఏడాది సర్వీస్‌తోనే ఈ ప్రయోజనం పొందే అవకాశం కల్పించారు.
కొత్త నిబంధనల ప్రకారం ఈ మార్పులు 2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీంతో ఆ తర్వాత ఉద్యోగంలో చేరినవారికి లేదా కొత్త కోడ్ ప్రకారం పనిచేసే వారికి ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. ఉద్యోగం వదిలే సమయంలో లేదా రిటైర్మెంట్ సమయంలో లభించే మొత్తం కూడా పెరగవచ్చని నిపుణులు చెబుతున్నారు.
అయితే ఇందులో ఒక కీలక ట్విస్ట్ ఉంది. ఈ ఒక ఏడాది నిబంధన అందరికీ వర్తించదు. ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రమే ఒక సంవత్సరం సర్వీస్




పూర్తి చేసిన తర్వాత గ్రాట్యుటీ లభిస్తుంది. వారు పనిచేసిన కాలానికి అనుగుణంగా కంపెనీలు గ్రాట్యుటీ చెల్లించాల్సి ఉంటుంది. ఇక శాశ్వత ఉద్యోగుల విషయంలో మాత్రం పాత నిబంధన కొనసాగుతుంది. అంటే, రెగ్యులర్ ఎంప్లాయీస్‌కు కనీసం ఐదేళ్ల సర్వీస్ తప్పనిసరి. అయితే మరణం లేదా అంగవైకల్యం వంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఈ పరిమితి వర్తించదు.
మరోవైపు గ్రాట్యుటీ లెక్కించే విధానంలో కూడా మార్పులు చేశారు. ఉద్యోగి బేసిక్ శాలరీ, డియర్‌నెస్ అలవెన్స్ (DA), రిటైనింగ్ అలవెన్స్ కలిపి మొత్తం సిటిసిలో కనీసం 50 శాతం ఉండేలా నిబంధనలు తీసుకొచ్చారు. దీంతో భవిష్యత్తులో ఉద్యోగుల చేతికి వచ్చే గ్రాట్యుటీ మొత్తం పెరిగే అవకాశం ఉంది.

# ఎయిర్‌టెల్ దూకుడు.. వీఐకు ఊరట

**ముంబై, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత టెలికం రంగంలో పోటీ మరింత ఆసక్తికరంగా మారుతోంది. భారతి ఎయిర్‌టెల్ తన వినియోగదారుల సంఖ్యను నిరంతరం పెంచుకుంటూ ముందుకు దూసుకెళ్తుండగా, వొడాఫోన్ ఐడియాకు స్వల్ప ఊరటనిచ్చే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, రిలయన్స్ జియో దేశంలో అగ్రస్థానాన్ని కాపాడుకుంటూ కొనసాగుతోంది.
గత కొన్ని నెలలుగా భారతీ ఎయిర్‌టెల్ స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. యంత్రంనుంచియంత్రానికి అనుసంధానాల సహా, వాటిని మినహాయించినప్పటికీ సంస్థకు కొత్తగా వినియోగదారులు చేరుతుండటం గమనార్హం. విస్తృతమైన సేవలు, మెరుగైన వలయ సదుపాయాలతో కొత్త ఖాతాదారులను ఆకర్షించడంలో ఎయిర్‌టెల్ ముందంజలో ఉంది.
మరోవైపు ఆర్థిక ఒత్తిడులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియాకు ఫిబ్రవరి నెలలో కొంత సానుకూల సంకేతం లభించింది. గత జూలై తర్వాత తొలిసారిగా ఈ సంస్థ నికరంగా సుమారు ఇరవై రెండువేల మంది కొత్త వినియోగదారులను చేర్చుకుంది. వినియోగదారుల తగ్గుదలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు కొంతవరకు ఫలిస్తున్నాయని ఇది సూచిస్తోంది.
ఇక రిలయన్స్ జియో దేశంలోనే అతిపెద్ద టెలికం సంస్థగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. ఇప్పటికే భారీ వినియోగదారుల ఆధారం ఉండటంతో కొత్తగా చేరే వారి సంఖ్య వృద్ధి పరంగా తక్కువగా కనిపిస్తోంది. మొత్తం మీద టెలికం రంగంలో పోటీ తీవ్రంగా కొనసాగుతుండగా, మార్కెట్ వాటాలో వొడాఫోన్ ఐడియా ఇంకా వెనుకబడిన స్థితిలోనే ఉంది.







# సర్వీస్ కేంద్రాల విస్తరణలో మారుతి దూకుడు

**ముంబై, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశంలోని అతిపెద్ద ఆటోమొబైల్ సంస్థ మారుతి సుజుకి ఇండియా తన అమ్మకాల అనంతర సేవల వలయాన్ని రికార్డు స్థాయిలో విస్తరించింది. 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 502 కొత్త సేవా కేంద్రాలను ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది. ఒకే ఏడాదిలో ఇంత భారీగా విస్తరణ జరగడం సంస్థ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. దీంతో దేశంలోని 3,000కు పైగా నగరాలు, పట్టణాల్లో మొత్తం సేవా కేంద్రాల సంఖ్య 5,926కు చేరుకుంది.
ఈ విస్తరణలో భాగంగా మహానగరాల నుంచి మారుమూల ప్రాంతాల వరకు వినియోగదారులకు సేవలు అందించేందుకు వివిధ రూపాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అరెనా, నెక్సా వర్క్‌షాప్‌లు, అమ్మకాలు సేవా కేంద్రాలు, వాహనంపై సేవ వంటి విధానాల ద్వారా వినియోగదారులకు మరింత చేరువ కావాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.
ఈ సందర్భంగా సంస్థ నిర్వహణ అధికారి హిసాషి టేకుచి మాట్లాడుతూ, వినియోగదారులు కేంద్రానికి వెళ్లినా, ఇంటి వద్ద సేవ కోరుకున్నా, ప్రయాణంలో సహాయం అవసరమైనా సంస్థ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 2030-31 నాటికి తమ సేవా కేంద్రాల సంఖ్యను సుమారు 8,000కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.
కంపెనీ తన తొలి సేవా కేంద్రాన్ని 1983లో ప్రారంభించగా, వెయ్యి కేంద్రాల సంఖ్యను చేరుకోవడానికి దాదాపు పద్నాలుగు సంవత్సరాలు పట్టింది. ఇక మార్చి నెలలో సంస్థ విక్రయాలు కూడా పెరుగుదల నమోదు చేశాయి. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈసారి విక్రయాల సంఖ్య గణనీయంగా పెరిగింది. అదే సమయంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీ షేరు విలువ ఒక శాతం పెరిగి 12,632 రూపాయల వద్ద ముగిసింది.

# మళ్లీ తగ్గిన బంగారం ధరలు..

**హైదరాబాద్, ఏప్రిల్ 3 (తెలంగాణ ముచ్చట్లు):**

పసిడి ధరలు మళ్లీ తగ్గుతూ వినియోగదారులకు కొంత ఊరట కలిగిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో పెరిగిన బంగారం ధరలు ఇప్పుడు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి.
తాజా వివరాల ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,48,960గా నమోదైంది. అలాగే 22 క్యారెట్ బంగారం ధర రూ.1,36,540గా ఉండగా.. 18 క్యారెట్ బంగారం ధర రూ.1,11,720 వద్ద ట్రేడవుతోంది. గురువారంతో పోలిస్తే ప్రతి కేటగిరీపై రూ.10 చొప్పున తగ్గుదల నమోదైంది.
అంతకుముందు 24 క్యారెట్ బంగారం ధర రూ.1,48,970గా ఉండగా, 22 క్యారెట్ రూ.1,36,550, 18 క్యారెట్ రూ.1,11,730గా ట్రేడ్ అయ్యాయి. ప్రస్తుతం స్వల్పంగా తగ్గినా, మొత్తం మీద ధరలు ఇంకా అధిక స్థాయిలోనే కొనసాగుతున్నాయి.
ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు దాదాపు ఇదే స్థాయిలో ఉన్నాయి. ముంబై, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నంలో 24



క్యారెట్ బంగారం ధర రూ.1,48,960గా ఉండగా, ఢిల్లీలో రూ.1,49,110, చెన్నైలో రూ.1,49,990 వరకు నమోదైంది.
అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు, డాలర్ విలువ పెరగడం వంటి అంశాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం ప్రారంభానికి ముందు ఉన్న గరిష్ఠ స్థాయిల నుంచి ప్రస్తుతం ధరలు తగ్గుతున్నప్పటికీ, మార్కెట్‌లో అస్థిరత ఇంకా కొనసాగుతూనే ఉంది.
నిపుణుల అభిప్రాయం ప్రకారం రాబోయే రోజుల్లో కూడా బంగారం ధరలు అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి మారే అవకాశం ఉంది. కాబట్టి కొనుగోలు చేసే ముందు తాజా రేట్లు తెలుసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# 1 భూగర్భ గనుల నిర్మూలన దిశగా ప్రపంచ అడుగులు

- అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం
- మానవాళి రక్షణకు పెను సవాలుగా మారిన మందుపాతరలు
- ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
- బాధితుల పునరావాసం మరియు సురక్షిత భవిష్యత్తు కోసం పిలుపు



**డెస్క్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన అంతర్జాతీయ గనుల అవగాహన మరియు గనుల చర్యల సహాయ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. యుద్ధాలు ముగిసిన దశాబ్దాల తర్వాత కూడా భూమిలో పాతిపెట్టిన మందుపాతరలు అమాయక ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. ఈ భయంకరమైన ముప్పుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి, పేలని మందుపాతరలను గుర్తించి నిర్మూలించడానికి ఐక్యరాజ్యసమితి ఈ రోజును కేటాయించింది. శాంతియుత సమాజ స్థాపనలో భూగర్భ గనుల నిర్మూలన అనేది అత్యంత కీలకమైన అంశంగా మారింది. ఈ రోజున ప్రపంచ దేశాలన్నీ ఏకమై గనులు లేని భూమిని నిర్మించేందుకు తమ నిబద్ధతను చాటుకుంటాయి.

భూగర్భ గనులు మరియు యుద్ధంలో మిగిలిపోయిన పేలుడు పదార్థాలు ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడిన దేశాల్లో సాగు భూముల్లో గనులు ఉండటం వల్ల రైతులు పొలాల్లోకి వెళ్లలేక పోతున్నారు. దీనివల్ల ఆహార భద్రత దెబ్బతినడమే కాకుండా పేదరికం పెరుగుతోంది. రహదారులు, పాఠశాలలు మరియు ఆసుపత్రుల నిర్మాణానికి కూడా ఈ గనులు ఆటంకం కలిగిస్తున్నాయి. మందుపాతరలను తొలగించడం ద్వారా మాత్రమే ఆయా ప్రాంతాల్లో జనజీవనం మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటుంది. అందుకే గనుల నిర్మూలనను కేవలం సైనిక చర్యగా కాకుండా మానవతా దృక్పథంతో చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మందుపాతరల ప్రభావం వల్ల ప్రతి ఏటా వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు శాశ్వత అంగవైకల్యానికి గురవుతున్నారు. బాధితుల్లో ఎక్కువ శాతం మంది పసిపిల్లలు మరియు మహిళలు ఉండటం అత్యంత విచారకరం. అంగవైకల్యానికి గురైన వారికి నాణ్యమైన వైద్యం అందించడం, వారికి కృత్రిమ అవయవాలను అమర్చడం మరియు వారి మానసిక స్థితిని మెరుగుపరచడం ఈ దినోత్సవం యొక్క ముఖ్య లక్ష్యాలలో ఒకటి. బాధితులు సమాజంలో గౌరవంగా జీవించేలా వారికి ఉపాధి అవకాశాలను కల్పించడంలో ప్రభుత్వాలు మరియు స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వారి జీవితాల్లో వెలుగులు నింపడం మనందరి సామాజిక బాధ్యత. గనుల నిర్మూలన ప్రక్రియలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. డ్రోన్లు, రిమోట్ కంట్రోల్ వాహనాలు మరియు అధునాతన సెన్సార్ల సహాయంతో ప్రాణనష్టం లేకుండా మందుపాతరలను గుర్తించడం సులభతరమవుతోంది. ఐక్యరాజ్యసమితి గనుల చర్యల విభాగం అనేక దేశాల్లో స్థానిక ప్రజలకు ఈ సాంకేతికతపై శిక్షణ ఇస్తోంది. ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చు. అంతర్జాతీయ సమాజం నుంచి అందుతున్న ఆర్థిక సహాయం ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతం చేయడానికి తోడ్పడుతోంది. సురక్షితమైన సాంకేతికత ద్వారానే గనుల రహిత ప్రపంచం సాధ్యమవుతుంది. గనుల రహిత ప్రపంచం అనేది కేవలం ఒక లక్ష్యం మాత్రమే కాదు, అది రాబోయే తరాలకు మనం ఇచ్చే గొప్ప బహుమతి. ప్రతి అడుగు భయం లేకుండా వేయగలిగినప్పుడే నిజమైన స్వేచ్ఛ సిద్ధిస్తుంది. ఈ ఏప్రిల్ 4న మనం కూడా గనుల వల్ల కలిగే ప్రమాదాల గురించి ఇతరులకు అవగాహన కల్పిద్దాం. యుద్ధాల వల్ల కలిగే వినాశనాన్ని ఆపి, శాంతి మార్గంలో పయనించాలని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రభుత్వాలు తమ రక్షణ బడ్జెట్‌లో కొంత భాగాన్ని ఈ గనుల నిర్మూలనకు కేటాయించడం ద్వారా వేగవంతమైన ఫలితాలను సాధించవచ్చు. మానవతా విలువలను కాపాడుకుంటూ, ప్రతి ఒక్కరూ సురక్షితంగా జీవించే హక్కును కల్పిద్దాం. ఆ దిశగా మన ప్రయాణం కొనసాగాలి.

# ప్రకృతి ప్రకోపం




- గ్లోబల్ వార్మింగ్‌తో విలవిలలాడుతున్న భూగోళం
- అస్తవ్యస్తమైన రుతుపవనాలు, అకాల వర్షా లతో పెరిగిన ముప్పు
- కార్బన్ ఉద్గారాల నియంత్రణకు దేశాల 'నెట్ జీరో' ప్రతిజ్ఞలు
- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అంతర్జాతీయ వేదికలపై చర్చలు

**డెస్క్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ మార్పులు పెను సవాలుగా మారాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగా భూమి ఉపరితల ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతుండటంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. దీని ప్రభావంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ధృవ ప్రాంతాల్లో మంచు కరగడం, సముద్ర మట్టాలు పెరగడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. శాస్త్రవేత్తల హెచ్చరికల ప్రకారం, తక్షణమే నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. పారిశ్రామికీకరణ మరియు అడవుల నరికివేత వల్ల వాతావరణంలో పేరుకుపోతున్న హానికారక వాయువులే ఈ విపత్తుకు ప్రధాన కారణమని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వాతావరణ మార్పుల వల్ల అత్యంత ప్రభావం చూపుతున్న అంశం అకాల వర్షాలు. గత కొన్నేళ్లుగా రుతుపవనాల గమనం పూర్తిగా మారిపోయింది. కురవాల్సిన సమయంలో వర్షాలు కురవకపోవడం, అనూహ్య సమయంలో భారీ వర్షాలు మరియు వరదలు రావడం వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతోంది. పంటల సాగు సమయం మారిపోవడంతో ఆహార భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. తీవ్రమైన కరువులు ఒకవైపు, ఊహించని తుపానులు మరోవైపు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఈ మార్పుల వల్ల జీవవైవిధ్యం దెబ్బతిని అనేక రకాల పక్షులు, జంతువులు అంతరించిపోయే దశకు చేరుకున్నాయి. ఈ విపత్కర పరిస్థితుల నుండి భూమిని కాపాడుకోవడానికి ప్రపంచ దేశాలు 'నెట్ జీరో' లక్ష్యాలను ప్రకటించాయి. దీని అర్థం వాతావరణంలోకి విడుదలయ్యే గ్రీన్ హౌస్ వాయువుల పరిమాణాన్ని, ప్రకృతి గ్రహించే పరిమాణంతో సమానం చేయడం. అమెరికా, చైనా, భారత్ వంటి దేశాలు రాబోయే కొన్ని దశాబ్దాల్లో కార్బన్ ఉద్గారాలను సున్నా స్థాయికి తీసుకువస్తామని అంతర్జాతీయ వేదికలపై హామీ ఇచ్చాయి. ఇందులో భాగంగా శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి, సౌర మరియు పవన శక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మొగ్గు చూపుతున్నాయి. విద్యుత్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం మరియు పారిశ్రామిక రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టడం వంటి చర్యలు వేగవంతం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ సదస్సుల్లో ధనిక దేశాలు మరియు పేద దేశాల మధ్య చర్చలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన నిధులను అభివృద్ధి చెందిన దేశాలు సమకూర్చాలని భారత్ వంటి దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రతి దేశం తనవంతు బాధ్యతగా కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది. కేవలం ప్రభుత్వాలే కాకుండా ప్రైవేటు సంస్థలు కూడా పర్యావరణ అనుకూల విధానాలను అవలంబించాలని ఐక్యరాజ్యసమితి కోరుతోంది. ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాల తగ్గింపుపై సరైన పర్యవేక్షణ లేకపోతే, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడం కష్టతరమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ మార్పులపై సామాన్య ప్రజల్లో కూడా అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అడవుల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, ఇంధన పొదుపు వంటి చిన్న మార్పులు కూడా పెద్ద ఫలితాలను ఇస్తాయి. ప్రతి వ్యక్తి పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకుంటేనే రాబోయే తరాలకు సురక్షితమైన భూమిని అందించగలం. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు ప్రజల మద్దతు తోడైతేనే 'నెట్ జీరో' వంటి ప్రతిష్టాత్మక లక్ష్యాలు నెరవేరుతాయి. ప్రకృతిని కాపాడుకోవడం అంటే మనల్ని మనం కాపాడుకోవడమే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. సమయం మించిపోకముందే అంతర్జాతీయ సమాజం ఏకతాటిపైకి వచ్చి ప్రకృతి సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



# సైకిల్‌గా మారే స్కూటర్

ఎలక్ట్రిక్ వాహన రంగంలో విన్‌ఫాస్ట్ సరికొత్త ఆవిష్కరణతో ముందుకొచ్చింది. మధ్యతరగతి వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన అమియో ఎలక్ట్రిక్ స్కూటర్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది స్కూటర్ మాత్రమే కాకుండా అవసరమైతే సైకిల్‌లా కూడా ఉపయోగించుకోవచ్చు. సాధారణంగా ఎలక్ట్రిక్ స్కూటర్‌లో బ్యాటరీ అయిపోయిన వెంటనే ప్రయాణం ఆగిపోతుంది. అయితే ఈ మోడల్‌లో పెడల్ వ్యవస్థను అమర్చడం వల్ల ఛార్జ్ లేకపోయినా సైకిల్‌లా తొక్కుకుంటూ ప్రయాణం కొనసాగించవచ్చు. ఈ ప్రత్యేకతే దీనిని ఇతర వాహనాల నుంచి భిన్నంగా నిలబెడుతోంది. పట్టణాల్లో ఇరుకైన రహదారులు, రద్దీ ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని దీన్ని తేలికపాటి రూపకల్పనతో తయారు చేశారు. విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఇది అనుకూలంగా ఉంటుంది. గరిష్ట వేగం తక్కువగా ఉండటంతో ప్రత్యేక అనుమతులు అవసరం లేకుండా సులభంగా వినియోగించుకోవచ్చు. పనితీరు పరంగా చూస్తే ఇందులో ఎనిమిది వందల వాట్ల మోటారు అమర్చారు. గరిష్ట వేగం గంటకు సుమారు ముప్పై కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఒకసారి పూర్తి ఛార్జ్ చేస్తే సుమారు అరవై నుంచి డెబ్బై కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీ దీనిలో ఉపయోగించారు. ధర విషయానికి వస్తే ప్రారంభ స్థాయి వినియోగదారులకు అందుబాటులో ఉండేలా సుమారు అరవై ఐదు వేల రూపాయల నుంచి ఎనభై ఒక వేల రూపాయల వరకు ధరను నిర్ణయించారు. తక్కువ ఖర్చుతో పర్యావరణహితంగా చిన్న దూరాలు ప్రయాణించాలనుకునే వారికి ఈ స్కూటర్ మంచి ఎంపికగా భావిస్తున్నారు.




# ఆరోగ్య రక్షణలో కీలకమైన పోషకంపై అవగాహన

- రోగనిరోధక శక్తిని పెంచడంలో విటమిన్ సి ప్రాముఖ్యత
- చర్మ సౌందర్యం మరియు కణజాల మరమ్మతులో దీని పాత్ర
- సహజ సిద్ధమైన ఆహార పదార్థాల ద్వారా విటమిన్ సి ప్రాప్తి
- అంతర్జాతీయ విటమిన్ సి దినోత్సవం

**డెస్క్, ఏప్రిల్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన అంతర్జాతీయ విటమిన్ సి దినోత్సవాన్ని జరుపుకుంటారు. మానవ శరీరానికి అత్యంత అవసరమైన పోషకాలలో విటమిన్ సి ఒకటి. ఇది మన శరీరంలో సహజంగా ఉత్పత్తి కాదు, కాబట్టి మనం తీసుకునే ఆహారం ద్వారానే దీనిని పొందాల్సి ఉంటుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో, కణాల నాశనాన్ని అడ్డుకోవడంలో ఈ విటమిన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ దినోత్సవం సందర్భంగా విటమిన్ సి యొక్క ఉపయోగాలు మరియు అది లోపిస్తే కలిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశ్యం. ఆరోగ్యకరమైన జీవనశైలికి విటమిన్ సి ఒక పునాది వంటిది.

విటమిన్ సి లేదా ఆస్కార్బిక్ యాసిడ్ ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది శరీరంలోని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని నివారిస్తుంది, తద్వారా క్యాన్సర్ మరియు గుండె సంబంధిత వ్యాధుల ముప్పును తగ్గిస్తుంది. రక్తపోటును నియంత్రించడంలో మరియు రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఇది సహాయపడుతుంది. గాయాలు త్వరగా మానడానికి అవసరమైన కొల్లాజెన్ ప్రోటీన్ ఉత్పత్తికి విటమిన్ సి అత్యంత అవసరం. ఎముకలు, దంతాలు మరియు మృదులాస్థి ఆరోగ్యంగా ఉండటానికి ఇది తోడ్పడుతుంది. అందుకే వైద్యులు ప్రతిరోజూ తగినంత మోతాదులో విటమిన్ సి తీసుకోవాలని సూచిస్తుంటారు. మన చర్మ సౌందర్యాన్ని కాపాడటంలో విటమిన్ సి పాత్ర అమోఘం. వృద్ధాప్య ఛాయలను తగ్గించి, చర్మం ప్రకాశవంతంగా మెరిసేలా చేయడంలో ఇది తోడ్పడుతుంది. సూర్య రశ్మి వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షించడానికి అనేక సౌందర్య సాధనాల్లో దీనిని ఉపయోగిస్తారు. అలాగే, జుట్టు రాలడాన్ని తగ్గించి, కుదుళ్లను దృఢంగా ఉంచడంలో కూడా ఇది సహాయపడుతుంది. ఐరన్ (ఇనుము) గ్రహించే శక్తిని శరీరం పెంపొందించుకోవడానికి విటమిన్ సి తోడ్పడుతుంది, దీనివల్ల రక్తహీనత వంటి సమస్యలు దరిచేరవు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ఈ విటమిన్ అవసరమని పరిశోధనలు చెబుతున్నాయి.

విటమిన్ సి లోపిస్తే 'స్కర్వీ' వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల చిగుళ్ల నుండి రక్తం కారడం, నీరసం, చర్మంపై దద్దుర్లు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల తరచుగా జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ప్రస్తుతం మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల చాలా మంది ఈ పోషక లోపంతో బాధపడుతున్నారు. ధూమపానం చేసేవారిలో విటమిన్ సి స్థాయిలు వేగంగా పడిపోతాయి, కాబట్టి వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఈ సమస్యలను అధిగమించడానికి సమతుల్య ఆహారం తీసుకోవడం ఒక్కటే మార్గం.

ప్రకృతి సిద్ధంగా లభించే అనేక పండ్లు, కూరగాయల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. నారింజ, నిమ్మ, బత్తాయి వంటి సిట్రస్ జాతి పండ్లు దీనికి ప్రధాన వనరులు. అలాగే ఉసిరి, జామ, స్ట్రాబెర్రీ, కివీ పండ్లలో కూడా ఇది అధికంగా దొరుకుతుంది. కూరగాయల విషయానికి వస్తే బ్రకోలీ, క్యాప్సికమ్, టమోటాలు మరియు ఆకుకూరల్లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. కృత్రిమమైన సప్లిమెంట్ల కంటే సహజమైన ఆహారం ద్వారా విటమిన్ సి పొందడం ఎంతో శ్రేయస్కరం. వేడి చేయడం వల్ల విటమిన్ సి నశిస్తుంది కాబట్టి, సాధ్యమైనంత వరకు పండ్లను పచ్చిగానే తీసుకోవడం మంచిది. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో పోషకాహార అవగాహన ఎంతో ముఖ్యం. పాఠశాలలు మరియు కార్యాలయాల్లో విటమిన్ సి యొక్క ప్రాముఖ్యతపై చర్చా కార్యక్రమాలు నిర్వహించాలి. ముఖ్యంగా పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు అవసరమైన మోతాదులో ఈ విటమిన్ అందేలా చూడాలి. ఈ దినోత్సవం సందర్భంగా విటమిన్ సి అధికంగా ఉండే ఆహార పదార్థాలను మన రోజువారీ భోజనంలో భాగం చేసుకుంటామని నిర్ణయించుకుందాం. చిన్నపాటి ఆహార మార్పుల ద్వారా పెద్ద ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. ప్రజల్లో ఈ చైతన్యం తీసుకురావడమే అంతర్జాతీయ విటమిన్ సి దినోత్సవం యొక్క అసలు విజయం.

కరోనా వంటి మహమ్మారి సమయంలో రోగనిరోధక శక్తి విలువను ప్రపంచం గుర్తించింది. అప్పట్లో విటమిన్ సి ప్రాముఖ్యత మరింతగా చర్చకు వచ్చింది. శరీరం వైరస్‌లతో పోరాడటానికి సిద్ధంగా ఉండాలంటే ఈ విటమిన్ నిరంతరం అందాలి. ఇది కేవలం ఒక రోజు జరుపుకునే వేడుక కాకూడదు, మన నిత్య జీవితంలో ఒక అలవాటుగా మారాలి. వ్యాయామంతో పాటు సరైన పోషకాలు తీసుకోవడం వల్ల దీర్ఘాయువు సిద్ధిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య స్థితిని గమనించుకుంటూ, అవసరమైతే నిపుణుల సలహాలు తీసుకోవాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రాన్ని పాటిస్తూ ముందుకు సాగుదాం. విటమిన్ సి దినోత్సవం మన ఆరోగ్య పరిరక్షణకు ఒక గుర్తుగా నిలుస్తుంది. ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన పండ్లు మరియు కూరగాయల ద్వారా ఈ పోషకాన్ని పొంది, వ్యాధి రహితంగా జీవించడం సాధ్యమే. మనతో పాటు మన కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం మన బాధ్యత. రేపటి ఏప్రిల్ 4వ తేదీన విటమిన్ సి ప్రాముఖ్యతను పదిమందికి తెలియజేద్దాం. ఆరోగ్యకరమైన ఆహారమే మనకు అసలైన ఔషధం. అందరూ దృఢంగా, ఉత్సాహంగా ఉండాలని కోరుకుంటూ, ఈ దిశగా అడుగులు వేద్దాం. ఆరోగ్యవంతమైన భారతాన్ని నిర్మిద్దాం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## గుడ్ ఫ్రైడే సందర్భంగా తాటికాయలలో

# యేసు సిలువ మార్గ యాత్ర

**ధర్మసాగర్,ఏప్రిల్03(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా పరిశుద్ధ సిలువ మార్గ యాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధుల గుండా సాగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ యాత్రను విచారణ గురువులు ఫాదర్ రామంచ శరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర పవన్ కళ్యాణ్ యేసు ప్రభువు వేషధారణలో పాల్గొని భక్తులను ఆకట్టుకున్నారు. యాత్రలో పాల్గొన్న భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఫాదర్ రామంచ శరత్ కుమార్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే రోజు యేసు క్రీస్తు చేసిన త్యాగాన్ని గుర్తుచేసుకునే పవిత్ర దినమని తెలిపారు. మన పాపాల విమోచన కోసం యేసు సిలువపై అనుభవించిన బాధలు మానవాళికి ప్రేమ, క్షమ, త్యాగానికి నిదర్శనమని అన్నారు. ప్రతి క్రైస్తవుడు యేసు బోధించిన ప్రేమ, క్షమ, వినయం వంటి విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు. అలాగే సిలువ మార్గ యాత్ర ద్వారా యేసు క్రీస్తు ఎదుర్కొన్న శ్రమలను మనసులో నాటుకొని, ఆత్మపరిశీలనతో జీవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సోదరభావం నెలకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సంఘ పెద్దలు పట్ల రాంచందర్, ఎర్ర యాదగిరి, వార్డు సభ్యులు పట్ల రమేష్, బొల్లెపాక అనిత, పట్ల యాదమ్మతో పాటు గ్రామ పెద్దలు, డాన్ బోస్కో యూత్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.












# యువతలో రాజకీయ పవనాలు

యువత రాజకీయాల్లోకి రావాలని, పాలితులుగా ఉండకుండా పాలకులుగా వారు ఎదగాలని ప్రతీ ఒక్కరూ ఆకాంక్షిస్తారు. కానీ, ఆచరణలో ఆ దిశగా యూత్‌ను చైతన్య పరిచి రాజకీయ రంగంలో వారు ముందుకు సాగేలా ప్రోత్సహించే వారు కొద్ది మందే. ముఖ్యంగా యువతలో రాజకీయ చైతన్యం నింపుతూ.. తమదైన గమ్యం చేరుకునేలా ప్రోత్సాహం అందించడం కీలకం. ఆ దిశగా వారి అడుగులు పడేలా ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన వంతు ప్రోత్సాహం ఇస్తున్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తన జనసేన పార్టీలో యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. సంప్రదాయ రాజకీయ పార్టీలకు ఉండే భావజాలానికి భిన్నంగా తన పార్టీలో జనసైనికులకు తమదైన పంథాలో ప్రయాణం కొనసాగించేలా దిశానిర్దేశం చేస్తున్నారు. ఫలితంగా యువతలో రాజకీయ చైతన్యం పెరుగుతున్నది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో పొలిటికల్‌గా జర్నీ చేయాలని యువతీ యువకులు నడుం బిగుస్తున్నారని చెప్పొచ్చు. జనసేన పార్టీలో జనసైనికులుగా తమ రాజకీయాన్ని షురూ చేయాలనే యువత పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నది.

### దేశభక్తికి మారుపేరు

'అంత కలిపి నేను పిడికెడు మట్టే కావచ్చు. కానీ నేను ఒకసారి తలెత్తి చూస్తే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరుంది' అంటూ అశేష అభిమానులను ఉద్దేశించి పవన్ చెప్పే మాటలు ప్రతీ ఒక్కరిలో ఉత్సాహాన్ని, దేశభక్తిని నూరిపోస్తాయి. ముఖ్యంగా యువతను ఉద్దేశించి.. 'కలలు కను' అంటూ గుంటూరు శేషేంద్ర శర్మ, బాలగంగాధర్ తిలక్ కవితలను ఉటంకిస్తూ..భావోద్వేగంతో పవన్ చెప్పే మాటల యువతను ఉత్తేజితం చేస్తున్నాయి. ప్రస్తుతం పాలనాపరంగా డిప్యూటీ సీఎంగా సేవలందిస్తూనే.. నటనాపరంగానూ కుదిరినంతలో సినిమాలు చేస్తూ.. ఒకే సమయంలో నటుడిగానూ, నాయకుడిగానూ.. జోడు గుర్రాల మీద స్వారీ చేస్తూ.. ప్రజల్లో ఉన్నారు. జనసేన అధినేతగా ఉన్న పవన్ కల్యాణ్.. ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి అత్యంత ఆత్మీయుడిగా ఉన్నారు. ఆయన భవిష్యత్తులో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు మెండుగానే కనిపిస్తున్నాయి. ఆయన తనను తాను తెలుగు రాష్ట్రాలకే పరిమితం చేసుకోకుండా దక్షిణ భారతదేశంతో పాటు ఉత్తర భారతంలోని వివిధ అంశాలపైన మాట్లాడటం చూస్తుంటే.. యువతలో రాజకీయ చైతన్యం కలిగించేలా.. వారికి జనసేనను ఒక రాజకీయ వేదికగా అందించేందుకు గేట్లు తెరిచే ఉంచినట్లు స్పష్టమౌతున్నది. ఇక దక్షిణ భారతాన అయితే ఇప్పటికే పలువురు సినీ నటులు వెండితెరను వదిలి రాజకీయ రణరంగాన సంచలనాలు సృష్టించారు. ఆ కోవకు చెందిన నాయకుడిగా పవన్ కళ్యాణ్ నిలిచారు. అయితే, పవన్ తనదైన శైలిలో స్వయం ప్రకాశితుడిగా, పడి లేచిన కెరటంలా రాజకీయ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఆయన భాషలోనే మరో మాటలో చెప్పాలంటే.. 'ఎక్కడ నెగ్గాలో కాదు..ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడు గొప్పవాడు' అనే సినీ డైలాగ్‌ను రియల్ లైఫ్‌లోనూ పవన్ ఫాలో అవుతున్నట్లున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని అందులో.. బలమైన భావజాలం, సిద్ధాంతం, దేశం పట్ల ప్రేమతో, దేశభక్తితో కూడిన పార్టీగా ఉన్న జనసేనలోకి యువత పెద్ద ఎత్తున రావాలని.. నవ భారత నిర్మాణానికి అడుగులు పడాలని ఆశిస్తున్నా.



**- లింగబత్తిని కృష్ణ,**
**సీనియర్ జర్నలిస్ట్**

**అధికార వికేంద్రీకరణ, పర్యావరణ పరిరక్షణ, సుపరిపాలన వంటి అంశాలతో పాటు దేశభక్తి గురించి నినదించే నాయకుడిగా పవన్ పేరు సంపాదించుకున్నారు. ముఖ్యంగా యువత అభిమానించే లీడర్‌గా పవన్ ఎమర్జ్ అయ్యారు. భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగానూ ఆయన సినీ నటుడిగా ఫుల్ ఫేమస్. గూగుల్‌లో**

## విలక్షణశైలి పవన్ సొంతం

**ఆయన గురించి నెటిజన్లు ఎక్కువగా సెర్చ్ చేయడంతో గూగుల్ పాపులర్ పర్సన్‌గా యాక్టర్స్ కేటగిరీలో రికార్డుకెక్కారు. ఇక దేశంలో.. తెలుగు రాష్ట్రాలలోనే కాదు ఆ మాటకొస్తే.. దక్షిణాదియే కాదు.. యావత్ భారతదేశంలోనూ ఆయనకు పలుకుబడి ఉంది. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లు ఆయనకొక 'తుఫాను'లాగా ముందుకెళ్లగలరు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్‌తో దేశరాజకీయాల్లో ఆయన చరిత్ర సృష్టించారు.**

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in